సాక్షి రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 21 । జూలై । 2023



అభివృద్ధి పనులకు భూమిపూజ

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్లలోని 22వ వార్డులో అంబేడ్కర్ యువజన సంఘం, మహిళా సంఘం భవనం పనులకు గురువారం చైర్‌పర్సన్ జిందం కళ భూమి పూజ చేశారు.



మానేరు రోడ్డు మూసివేత

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మానేరునదిలో నీటి ప్రవాహం మొదలైంది. నదీ తీర ప్రాంతానికి ఎవరూ వెళ్లకుండా రోడ్డును మూసివేశారు.

గరిష్టం/కనిష్టం
26.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

సిరిసిల్ల డీఎస్పీగా ఉదయ్‌రెడ్డి



ఉదయ్‌రెడ్డి

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల డీఎస్పీ విశ్వప్రసాద్‌ను బదిలీ చేస్తూ ఆ స్థానంలో ఎస్.ఉదయ్‌రెడ్డికి విధులు కేటాయిస్తూ డీజీపీ అంజన్‌కుమార్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. 2017వ బ్యాచ్‌కు చెందిన ఉదయ్‌రెడ్డి డిప్యూటీ ఎస్పీగా ఆదిలాబాద్, చౌటుప్పల్‌లో విధులు నిర్వహించినట్లు సమాచారం.

జిల్లాలో సీఐల బదిలీ



ఉపేందర్ సిరిసిల్ల టౌన్ | సదన్‌కుమార్ సిరిసిల్ల రూరల్ | కె. శశిధర్ ఎల్లారెడ్డిపేట

సిరిసిల్లక్రైం: జిల్లాలో పనిచేస్తున్న సీఐ(సర్కిల్ ఇన్‌స్పెక్టర్)లను బదిలీచేస్తూ ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సిరిసిల్ల రూరల్ సీఐ భీమనాథుల ఉపేందర్‌ను సిరిసిల్లటౌన్ సీఐగా బదిలీ చేశారు. వరంగల్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న జి.సదన్‌కుమార్‌ను సిరిసిల్లరూరల్ సీఐగా బదిలీ చేశారు. ఎల్లారెడ్డిపేట సీఐగా రామగుండంలో ఉన్న కె.శశిధర్‌ను, సిరిసిల్లటౌన్ సీఐ అనిల్‌కుమార్‌ను సిరిసిల్ల ఎస్బీ సీఐగా బదిలీ చేశారు. వేములవాడ సీఐ వెంకటేశ్‌ను కరీంనగర్ కమిషనరేట్ సీఎస్‌బీకి కేటాయించారు. ఎస్బీ సీఐ కరుణాకర్‌ను ఎల్లారెడ్డిపేటకు బదిలీ చేశారు. ఎల్లారెడ్డిపేట సీఐ మొగిలిని ఎక్కడికి బదిలీ చేశారన్న సమాచారం లేదు. వేములవాడ టౌన్, వేములవాడరూరల్ సీఐ పోస్టులలో ఎవరికి అవకాశం ఇవ్వలేదు. వేములవాడరూరల్ సర్కిల్ నేడో, రేపో అధికారిక ఉత్తర్వులు వస్తాయని సమాచారం. ఎస్సైల బదిలీలు ఉంటాయని తెలిసింది.

ప్రజాసమస్యలపై పట్టింపేది?



రుద్రంగి(వేములవాడ): ప్రజాసమస్యల పరిష్కారంపై స్థానిక ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబుకు చిత్తశుద్ధి లేదని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విమర్శించారు. రుద్రంగిలోని వేములవాడ–కోరుట్ల ప్రధాన రోడ్డుపై గురువారం కాంగ్రెస్ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రుద్రంగి మండల కేంద్రంలోని రోడ్డును బాగు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, నాయకులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, చెలుకల తిరుపతి, దర్నా మల్లేశం, ద్యావల రవి, పల్లికొండ చింటు, అక్కినపెల్లి శ్రీనివాస్ ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



సిరిసిల్లటౌన్: డెంగీ వంటి విషజ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు కోరారు. డెంగీ నివారణ మాసోత్సవం సందర్భంగా గురువారం తన కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి మంగళ, శుక్రవారాలు డ్రై డే పాటించాలని సూచించారు. వైద్యులు శ్రీరాములు, రజిత, మహేశ్, నయీమా, ప్రోగ్రాం ఆఫీసర్లు లింగం, బాలయ్య పాల్గొన్నారు.

కుక్కలను తరలిస్తాం



వేములవాడ: వేములవాడలో వీధికుక్కలను పట్టించి అటవీ ప్రాంతానికి తరలింపజేస్తామని మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి పేర్కొన్నారు. మున్సిపల్ ఆఫీస్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే మున్సిపల్ పాలకవర్గం అనుమతి మేరకు రూ.లక్ష వెచ్చించి 150 కుక్కలను అటవీ ప్రాంతంలో వదిలేసినట్లు చెప్పారు. ఈనెల 19న మరోసారి కుక్కలు 25 మందిని గాయపరచడాన్ని పాలకవర్గం సీరియస్‌గా తీసుకుందన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పార్లే ప్రమాదం ఉందని పట్టణ శివారుకాలనీలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాత ఇళ్లల్లో నివసించే వారు వెంటనే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించారు.

కురిసిన వాన..
మురిసిన రైతన్న

- ముసురు వానతో పంటలకు జీవం
- పారుతున్న మానేరు, మూలవాగులు
- చెరువులు, కుంటల్లోకి చేరుతున్న వరద
- కూలిన పాత ఇళ్లు.. గూడు చెదిరిన పేదలు
- ఎల్లారెడ్డిపేటలో అత్యధికంగా 67.5 మి.మీ
- రుద్రంగిలో అత్యల్పంగా 25.4 మి.మీ



వరినాట్లు వేస్తున్న కూలీలు

సిరిసిల్ల: జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వానలతో జిల్లాలోని వాగులు, వంకలు పారుతున్నాయి. వర్షాకాలం ఆరంభంలో వర్షాలు సరిగ్గా లేక రైతులు ఆందోళన చెందారు. రెండుసార్లు విత్తనాలు వేసి, నారు పోసి నిరీక్షించారు. వానాకాలంలో లోటు వర్షాలు రైతులకు ప్రతికూలంగా మారాయి. కానీ గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వానల లోటు తీరింది.

పారుతున్న వాగులు

గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు, కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగు జలాశయాలు నిండకపోయినా.. పడువాటు నీళ్లలో పారుతున్నాయి. జిల్లాలోని చెరువులు, కుంటల్లోకి వరదనీరు చేరుతుండడంతో భూగర్భజలాలు పెరిగి వానాకాలం పంటలకు జీవం పోసినట్లు అయింది. రైతులు వర్షంలోనూ పొలాలు దున్నుతూ వరినాట్లు వేస్తున్నారు. జిల్లాలో 2.40 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఇందులో 1,62,036 ఎకరాల్లో వరి, 74,492 ఎకరాల్లో పత్తి పంటలు వేశారు.

జిల్లా అంతటా వానలు

జిల్లా వ్యాప్తంగా వర్షాలు భారీగా కురుస్తున్నాయి. ఎల్లారెడ్డిపేటలో అత్యధికంగా 67.5 మిల్లీమీటర్ల వర్షం పడగా.. అత్యల్పంగా రుద్రంగిలో 25.4 మిల్లీమీటర్లు కురిసింది. చందుర్తిలో 26.1, వేములవాడ రూరల్‌లో 25.6, బోయినపల్లిలో 29.6, వేములవాడలో 34.5, సిరిసిల్లలో 38.8, కోనరావుపేటలో 32.7, వీర్నపల్లిలో 37.3, గంభీరావుపేటలో 56.9, ముస్తాబాద్‌లో 62.4, తంగళ్లపల్లిలో 46.0, ఇల్లంతకుంటలో 44.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. గతేడాది జూలై 20వ తేదీ నాటికి 649.3 మిల్లీమీటర్ల వర్షం పడగా.. ప్రస్తుతం 286.3 మిల్లీమీటర్లు పడింది. జిల్లా సాధారణ వర్షపాతం 265.7 మిల్లీమీటర్లు కాగా.. ఇప్పటికే సాధారణ వర్షపాతాన్ని మించి కురిసింది. జిల్లాలోని ముస్తాబాద్, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేటల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో సాధారణ వర్షం కురిసింది. వేములవాడరూరల్, బోయినపల్లి మండలాల్లో ఇంకా లోటు వర్షం ఉంది. మొత్తంగా జిల్లాలో వానాకాలం పంటలకు ఆశజనకమైన వర్షాలు పడ్డాయి.



సిరిసిల్ల వద్ద పారుతున్న మానేరువాగు



దమ్మన్నపేటలో కూలిన మంగలి సాయిలు ఇల్లు

జిల్లాలో పంటల సాగు ఇలా..

సాగు విస్తీర్ణం	2.40 లక్షల ఎకరాలు
వరిపంట	1,62,036 ఎకరాలు
పత్తిపంట	74,492 ఎకరాలు

కూలిన ఇళ్లు.. రాలిన కన్నీళ్లు

జిల్లాలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో పాత ఇళ్లు తడిసిపోయి కూలుతున్నాయి. గంభీరావుపేట మండలం దమ్మన్నపేటలో మంగళి సాయిలుకు చెందిన ఇల్లు కూలడంతో ఇంట్లోని వారికి స్వల్పగాయాలయ్యాయి. ఇంట్లోని సామగ్రిని పక్కనే ఉన్న స్థలంలోకి మార్చుకున్నారు. ఇల్లు కూలడంతో సాయిలు కుటుంబం కన్నీటి పర్యంతమైంది. ఇల్లంతకుంట మండలం కందికట్కూర్‌లో బిగుళ్ల వజ్రమ్మ ఇల్లు కూలడంతో చిన్న కొడుకు మల్లేశం ఇంట్లో సామగ్రి పెట్టి, పెద్ద కొడుకు ఇంటి వద్దకు వెళ్లింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 10 ఇళ్లు పాక్షికంగా కూలినట్లు సమాచారం. ఇల్లు కూలిన వారు గుండెల నిండా దుఃఖంతో సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకున్నారు. జిల్లాలో అధికారులు ప్రాణనష్టం జరగకుండా ముందస్తుగానే అప్రమత్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ముసురు కొనసాగుతోంది. ప్రజలు చలిగాలులతో గజగజవణుకుతున్నారు. జిల్లాలో జనజీవనం స్తంభించింది.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



నర్మాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

గంభీరావుపేట(సిరిసిల్ల): గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. మండలంలోని నర్మాల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను గురువారం సందర్శించారు. పాఠశాలలో టాయిలెట్లు ఇతర పునరుద్ధరణ పనుల కోసం రూ.9.70 లక్షలు మంజూరయ్యాయని, ఇంకా పనులు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకొని రేపటి నుంచే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కిచెన్, డైనింగ్‌హాల్, డార్మెట్రీలను కలెక్టర్ పరిశీలించారు. సోలార్ వాటర్‌హీటర్, బోరు మోటారు కావాలని ప్రిన్సిపాల్ నిర్మల కోరారు.

సంపదవనంలో పూర్తిస్థాయిలో మొక్కలు నాటాలి

మండలంలోని నర్మాలలోని సంపదవనంలో పూర్తిస్థాయిలో మొక్కలు నాటాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. 12 ఎకరాల విస్తీర్ణంలో 5 బ్లాకులలో ఐదు వేల మొక్కలు నాటాలనే లక్ష్యంలో ఏర్పాటు చేసిన వనంలో వెంటనే మొక్కలు నాటాలన్నారు. సర్పంచ్ ఎడబోయిన రాజు, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, అదనపు డీఆర్డీవో మదన్‌మోహన్, ఎంపీడీవో శ్రీనివాస్ ఉన్నారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి

ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగిస్తూ ప్రసవాల సంఖ్య పెంచాలని వైద్యాధికారులు, సిబ్బందికి కలెక్టర్ సూచించారు. మండలంలోని ముస్తఫానగర్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని, లింగన్నపేట పీహెచ్‌సీని సందర్శించి సమీక్షించారు. లింగన్నపేట పీహెచ్‌సీ పరిధిలో ప్రసవాలు 70 శాతమే ఉన్నాయని, మిషన్ 80లో భాగంగా లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. సీజనల్‌వ్యాధులు ప్రబలకుండా ప్రతి మంగళ, శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. అవసరమైన మరమ్మతు పనులను ఆగస్టు 15లోపు పూర్తి చేయాలన్నారు. లింగన్నపేట, ముస్తఫానగర్ గ్రామాలకు రూ.20లక్షలతో ఉప కేంద్రాలు మంజూరయ్యాయని, వెంటనే టెండర్లు పిలవాలన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి సుమన్‌మోహన్‌రావు, ఉప వైద్యాధికారి రాములు, పీఆర్ ఏఈ సాయికుమార్, మండల వైద్యాధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్లపై అవగాహన ఉండాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



వీవీప్యాట్‌ల ప్రదర్శన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ఓటర్లకు అవగాహన ఉండాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఈవీఎం, వీవీప్యాట్‌ల ప్రదర్శన కేంద్రాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో ఆఫీస్‌ల్లోనూ ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. రెండు నియోజకవర్గాల్లో ప్రచార రథాలను ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లకు ఓటు వేసే విధానంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. రెండు నెలలపాటు ఈ ప్రచారం సాగుతోందని పేర్కొన్నారు. సెస్ డైరెక్టర్ జి.నారాయణరావు, కౌన్సిలర్ రెడ్డినాయక్, డిప్యూటీ తహసీల్దార్‌లు పాష, రహమాన్, సుజాత, రహీం, డీపీఆర్వో దశరథం తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై నమ్మకం కల్గించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: ప్రజల్లో పోలీసులపై నమ్మకం కలిగించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం అర్ధ వార్షిక సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ఆరు నెలల్లో పోలీస్‌స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులు, పోక్సో, గంజాయి, సైబర్ క్రైమ్లు, తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు నమ్మకం కలిగించేలా విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. గంజాయి, గుడుంబా, పేకాట, పీడీఎస్ బియ్యం, ఇసుక రవాణాను అరికట్టాలన్నారు. ఆరు నెలల్లో 20 కేసుల్లో నేరస్తులకు శిక్షలు పడ్డాయని తెలిపారు. మిస్సయి సెల్‌ఫోన్లపై 404 మంది ఫిర్యాదు చేస్తే 100 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు తెలిపారు. 3,405 డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన 33 మంది పోలీస్ అధికారులకు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు విశ్వప్రసాద్, నాగేంద్రచారి తదితరులు ఉన్నారు.

తప్పులు లేని జాబితాను సిద్ధం చేయండి

- ఇంటింటి సర్వేతో ఆధారాలు సేకరించాలి
- బీఎల్వోల శిక్షణలో కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయడంలో బూత్ లెవల్ అధికారుల(బీఎల్‌వో) పాత్ర కీలకమని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. సిరిసిల్ల పీఆర్ గెస్ట్‌హౌస్‌లో గురువారం బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్స్(ఏఎల్ఎంటీల)తో శిక్షణ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఓటర్ల జాబితా ఎంతో కీలకమన్నారు. తప్పులు లేని జాబితాను రూపొందించేందుకు బీఎల్‌వోలు కృషి చేయాలని సూచించారు. ఇంటింటి సర్వే ద్వారా పూర్తి వివరాలను ఆధారాలతో సేకరించాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటుహక్కు కల్పించాలని, ఇప్పుడు నిర్వహిస్తున్న స్పెషల్ సమ్మరి రివిజన్–2 ప్రకారం మార్పులు, చేర్పులు, సవరింపులు చేయాలన్నారు. ఫారమ్–6, 7, 8లపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆర్డీవో టి.శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ విజయ్‌కుమార్, మాస్టర్ ట్రైనర్ మహేందర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే పకడ్బందీగా చేపట్టాలి

చందుర్తి(వేములవాడ): ఇంటింటి ఓటర్ల సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ కోరారు. చందుర్తి మండల పరిషత్‌లో గురువారం బీఎల్వోలకు నిర్వహించిన శిక్షణ తరగతులను అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలతో బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికెళ్లి ఓటర్ల సవరణ సర్వే చేపట్టాలన్నారు. సెప్టెంబర్ 30 నాటికి 18 ఏళ్లు నిండిన వారిని ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. కుటుంబ సభ్యులందరికి ఒకే ఇంటి నంబర్ ఇస్తే వారంతా ఒకే పోలింగ్ పరిధిలోకి వచ్చేలా జాబితాను సిద్ధం చేయాలన్నారు. కొత్త పేర్ల నమోదు, మృతుల పేర్ల తొలగింపులు, ఇల్లు మారినా, ఇంటి నంబర్లు జోడింపు, అక్షర దోషాల వంటి సవరణలు చేసుకునేలా ఓటర్లతో ప్రతి అంశాన్ని ప్రస్తావించి సవరణలు చేసుకునేలా చూడాలని కోరారు. వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్, చందుర్తి తహసీల్దార్ మజీద్, డిప్యూటీ తహసీల్దార్ లీలారాణి, ఆర్ఐ రవి, శిక్షకులు రాజాగౌడ్, అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన

వేములవాడ: ఎన్నికల్లో సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ సూచించారు. గతంలోని అనుభవాలతో ఎన్నికలు సజావుగా నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణపై బీఎల్వోలు, బీఎల్వో సూపర్‌వైజర్లకు వేములవాడలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని గురువారం సందర్శించి మాట్లాడారు. ఓటర్లు ఓటుహక్కును సద్వినియోగం చేసుకులా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను, గడించిన అనుభవాన్ని ఎన్నికల సమయంలో ఉపయోగించుకోవాలని సూచించారు.

గర్భిణుల అత్యవసర సేవలకు టోల్ ఫ్రీ నంబర్

సిరిసిల్లటౌన్: రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు అధిక వర్షాల దృష్ట్యా గర్భిణులకు అత్యవసరంగా సేవలు అందేలా జిల్లాలో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారు. ఈమేరకు గురువారం డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు ప్రకటన విడుదల చేశారు. వర్షాకాలం జాగ్రత్తలను పాటించడం, అత్యవసర వైద్యసేవలకు 7936553254లో సంప్రదించాలని కోరారు.

నర్మాలలో 23 ఫీట్లు



గంభీరావుపేట(సిరిసిల్ల): నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టులో నీటి మట్టం పెరుగుతోంది. ప్రాజెక్టు నీటిమట్టం 30 ఫీట్లు కాగా గురువారం వరకు 23 ఫీట్లకు చేరింది.

ఎస్ఎస్ఐ యూనిట్లకు కరెంటు సబ్సిడీ ఇవ్వాలి

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఆర్డర్ల ద్వారా బతుకమ్మ చీరలు నేస్తున్న ఎస్ఎస్ఐ యూనిట్లకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని బీజేపీ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ కోరారు. ఈమేరకు గురువారం స్థానిక చేనేత, జౌళిశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందించి మాట్లాడారు. మధ్యతరగతికి చెందిన ఆసాములు ఎస్ఎస్ఐ యూనిట్లను ఏర్పాటు చేసుకునేలా ప్రభుత్వమే ప్రోత్సాహించి, చీరల ఆర్డర్లు ఇస్తుందన్నారు. కానీ ఇప్పుడు ఎస్ఎస్ఐ యూనిట్లు ఇండస్ట్రీ కిందకు వస్తాయంటూ సబ్సిడీ ఎత్తివేయడం సరికాదన్నారు.

నూకలమర్రి అమరులకు అరుణోదయ నివాళి



నివాళి అర్పిస్తున్న జనశక్తి నేత అమర్, విమలక్క

సిరిసిల్ల: వేములవాడరూరల్ మండలం నూకలమర్రిలో 23 ఏళ్ల కిందట అమరులైన వారికి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గురువారం నివాళి అర్పించింది. హైదరాబాద్‌లోని అరుణోదయ ఆఫీస్‌లో నూకలమర్రి అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జనశక్తి మాజీ రాష్ట్ర కార్యదర్శి కూర దేవేందర్ అలియాస్ అమర్, ఆయన భార్య, అరుణోదయ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అధ్యక్షురాలు విమలక్క అమరులకు జోహార్లు అర్పించారు. 23 ఏళ్ల కిందట అమర్ రాసిన 'నల్ల నల్ల రేగళ్ల నల్ల రేగళ్లల్ల ఎర్ర కలువ పూలు పూసే' పాటను విమలక్క బృందం ఆలపించింది. నూకలమర్రి ఎన్‌కౌంటర్‌లో అమరులైన అశోక్, జ్యోతి, చైతన్య, మల్లేశం, గసికంటి పర్శరాములు, సముద్రాల ఎల్లేందర్, దొంతుల రమేశ్‌లకు నివాళి అర్పించారు. అరుణోదయ జంట నగరాల అధ్యక్ష, కార్యదర్శులు పోతుల రమేశ్, రాకేశ్, అరుణోదయ సిటీ కమిటీ సభ్యులు విశాల, హరికృష్ణ, పీడీఎస్‌యూ(విజృంభణ) రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏపూరి పవన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాజన్న సేవలో సినీనటుడు బిత్తిరి సత్తి


రాజన్న సన్నిధిలో బిత్తిరి సత్తి కుటుంబసభ్యులు

వేములవాడ: వేములవాడ రాజన్నను సినీనటుడు బిత్తిరి సత్తి గురువారం కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు.

పీరీల ఉత్సవాలకు ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న కృష్ణారెడ్డి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని కిషన్‌దాస్‌పేట పీరీల ఉత్సవాల నిర్వహణకు సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి గురువారం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. ఈ నెల 29న పీరీల పండుగను ఘనంగా జరుపుకోవడానికి సాయం చేసిన ఆయనకు ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు గౌస్, రఫిక్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్


వెంకటేశ్

బోయినపల్లి(చొప్పదండి): యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బోయినపల్లి మండలం రత్నంపేటకు చెందిన డాక్టర్ కొడగాని వెంకటేశ్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్ 2008 నుంచి 2023 వరకు విద్యార్థి విభాగం నుంచి, యువజన కాంగ్రెస్‌లో మండల, బ్లాక్, జిల్లా స్థాయిలో వివిధ హోదాల్లో పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

గోడ కూలి 20 మేకలు మృతి


మృతిచెందిన మేకలు

తంగళ్లపల్లి: మండలంలోని గండిలచ్చపేటలో వర్షాల కారణంగా గురువారం రాత్రి గొర్రెల పాక గోడ కూలి 20 మేకలు మృతిచెందాయి. దాదాపు రూ.2 లక్షల నష్టం జరిగిందని కాపరి బుచ్చన్నగారి ఎల్లయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

వేములవాడ.. మురికి జాడ


ఈ చిత్రం వేములవాడ పట్టణంలోని సాయినగర్‌లోనిది. భవనాల మధ్యలో నిలిచిన వర్షపు నీటితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మల్లారం రోడ్డు, పాపన్నచౌక్, కోనాయపల్లి రోడ్డు, అర్బన్ కాలనీలతోపాటు అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది.


ఈ చిత్రం విద్యానగర్‌లోనిది. మురికి నీరంతా ఇళ్ల మధ్యలో నిలుస్తోంది. పలుమార్లు ప్రజాప్రతినిధులకు చెప్పినప్పటికీ డ్రైనేజీల నిర్మాణం చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న నాయకులు మా కాలనీకి వచ్చి చూడాలని అంటున్నారు.


ఈ చిత్రం మహాలక్ష్మి వీధిలోనిది. మురికి నీరు రోడ్డు పక్కన నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. స్థానికులు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. మొదటి బైపాస్ రోడ్డును ఆనుకొని ఉన్న కాలనీల్లోనూ ప్రజలు ఈ సమస్యతో నానాతంటాలు పడుతున్నారు.

- మున్సిపల్ పరిధి 28 వార్డుల్లోని ఖాళీ స్థలాలు, గుంతల్లో మురికి నీరు
- ఇళ్లలోకి వస్తున్న పందులు, కుక్కలు
- సీజనల్ వ్యాధులతో ప్రజల ఇబ్బందులు
- డ్రైనేజీలు లేకపోవడంతో దుస్థితి

వేములవాడ: మున్సిపాలిటీ పరిధిలోని వాడలన్నీ మురికి జాడనే అన్నట్లు ఉంది పరిస్థితి. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై, ఇళ్ల మధ్యలో నిలిచి ఉంటోంది. ఇక పలు వీధుల్లోని ఖాళీ ప్లాట్లలో చేరిన మురికి నీరు దుర్గంధం వెదజల్లుతోంది. పందులు, కుక్కలు, గేదెలు మురికి నీటిలో తిరుగుతూ ఇళ్లలోకి వస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

నాలుగు రోజులుగా జ్వరాలు..

ఇటీవల కురుస్తున్న వర్షాలకు వేములవాడ మున్సిపల్ పరిధి 28 వార్డుల్లోని ఖాళీ స్థలాలు, గుంతల్లో మురికి నీరు చేరుతోంది. దీంతో వీధులన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నాలుగు రోజులుగా చాలా మందికి జ్వరాలు వస్తున్నాయని చెబుతున్నారు. మున్సిపల్ అధికారులు చొరవ తీసుకొని, మురికి నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



డ్రైనేజీలు లేవు

విద్యానగర్‌లో ఎక్కడ చూసినా ఇళ్ల మధ్యలో నిలిచిన వర్షపు నీరు, మురికి నీరు కనిపిస్తుంది. బయటకు వెళ్లేందుకు అవసరమైన డ్రైనేజీలు లేకపోవడమే ఈ పరిస్థితికి కారణం. ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు శివారు కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలి.

– ఎండీ.అసద్, విద్యానగర్

దుర్వాసన వస్తోంది

మాది శివసాయి నగర్. వేములవాడ పట్టణంలోని లోతట్టు ప్రాంతం. పైనుంచి వచ్చే మురికి నీరంతా మా ఇళ్లలోనే నిలుస్తోంది. దుర్వాసన వస్తోంది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తామంటున్నారు. కానీ ఆచరణలో పెట్టడం లేదు. మా బాధలు తీరడం లేదు.

– గంప గౌరీశంకర్, శివసాయి నగర్



ఈసారి వెళ్లొచ్చి.. ఇక్కడే ఉంటానన్నాడు

- నెల క్రితమే సౌదీ వెళ్లిన మల్లాపూర్‌వాసి
- గుండెపోటుతో మృతి


రాజేశం (ఫైల్)

బోయినపల్లి: ఏళ్లుగా ఉపాధి కోసం గల్ఫ్ వెళ్తున్నాడు.. ఈసారి వెళ్లొస్తే.. ఇక వెళ్లనని కుటుంబసభ్యులకు చెప్పాడు.. నెల రోజుల క్రితమే వెళ్లి, గుండెపోటుతో మృతిచెందాడు బోయినపల్లి మండలంలోని మల్లాపూర్‌కు చెందిన నడిగొట్టు రాజేశం(48). స్థానికుల వివరాల ప్రకారం.. రాజేశంకు భార్య భారతి, కూతురు, కుమారుడు ఉన్నారు. అతను పదేళ్ల క్రితం పొత్తూర్‌లో దాబా పెట్టి, నష్టపోయాడు. దీంతో అప్పులు చేసి, సౌదీ వెళ్లాడు. అక్కడ హెల్పర్‌గా పనిచేస్తూ ఇంటికి వస్తూ పోతున్నాడు. రెండు నెలల క్రితం స్వగ్రామం వచ్చాడు. ఈసారి వెళ్లొస్తే.. ఇక ఇక్కడే ఉంటానని ఇంట్లో చెప్పి, నెల రోజుల క్రితమే సౌదీ వెళ్లాడు. ఈ క్రమంలో రాజేశం గుండెపోటుతో మృతి చెందినట్లు కంపెనీవారు గురువారం ఉదయం ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో మృతుడి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వీరికి పాత ఇల్లు ఉండగా కూలిపోయింది. ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉంటున్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచు శంకరయ్య కోరారు.

‘అరెస్టులతో నిజం దాగదు’

సిరిసిల్ల టౌన్: బీజేపీ నేతలను అరెస్టులు చేసినంత మాత్రాన కేంద్రం రాష్ట్రానికి అందిస్తున్న సహకారం, నిధుల విషయంలో నిజం దాగదని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అన్నల్‌దాస్ వేణు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డబుల్‌బెడ్రూం ఇళ్లను పరిశీలించేందుకు వెళ్తున్న కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని రాష్ట్ర సర్కారు అరెస్టు చేయించడం అప్రజాస్వామికమన్నారు. నియంత పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

కొండగట్టులో నీటి సమస్యకు పరిష్కారం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- రూ.13.43 కోట్లతో ఎత్తిపోతల పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యే రవిశంకర్

మల్యాల(చొప్పదండి): ‘చెప్పింది చేస్తాం.. అనుకున్నది సాధిస్తాం.. తెలంగాణ తెస్తామని తెచ్చి చూపించినం.. కోటి ఎకరాలకు సాగు నీరందిస్తున్నాం’ అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సీఎం కేసీఆర్ కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నప్పుడు నీటి సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలనే సంకల్పంతో ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టామని, దీంతో కొండగట్టులో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. మల్యాల మండలం ముత్యంపేట శివారులోని వరదకాలువ 81.10కిలో మీటరు వద్ద రెండు మోటార్లతో నిత్యం 10వేల క్యూసెక్కులను సంతలోని లొద్దిలోకి ఎత్తిపోసేందుకు రూ.13.43కోట్ల నిధులు కేటాయించగా, గురువారం వినోద్‌కుమార్, మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, కలెక్టర్ యాస్మిన్ భాషా, గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు. నాలుగు నెలల్లో ఎత్తిపోతల పనులు పూర్తిచేసి కొండగట్టుపైకి వరద కాలువ నీటిని తరలించనున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, కొండగట్టును అభివృద్ధి చేయాలనే సంకల్పంతో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే రవిశంకర్ చొరవను మంత్రి అభినందించారు. అంజన్న సన్నిధికి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొండపల్కల రామ్మోహన్‌రావు, పునుగోటి ప్రశాంతి, ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, పునుగోటి కృష్ణారావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, ఉప సర్పంచ్ కొండబత్తిని త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి మోడల్ స్కూల్‌కు రూట్ సర్వే

- తీరనున్న విద్యార్థుల బస్సు ప్రయాణ కష్టాలు


అల్మాస్‌పూర్‌లో సర్వే చేస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: వీర్నపల్లి మోడల్ స్కూల్ విద్యార్థుల బస్సు ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. ఆర్టీసీ సిరిసిల్ల డిపో నుంచి ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి, రాజన్నపేట, కిష్టునాయక్‌తండా, అల్మాస్‌పూర్ మీదుగా పాఠశాల వరకు ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు గురువారం బస్సు రూట్ సర్వే చేపట్టారు. ఆయా గ్రామాలకు చెందిన 35 మంది విద్యార్థులు నిత్యం ప్రధాన రహదారి వరకు నడుచుకుంటూ వచ్చి, ప్రైవేట్ వాహనాల్లో స్కూల్‌కు చేరుకుంటున్నారు. అయినా సమయానికి తరగతులకు హాజరుకాలేక పోతున్నారు. వారి కష్టాలను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు డీఎం మనోహర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఈ రూట్‌లో బస్సు నడిపించడానికి రూట్ సర్వే చేయించారు. త్వరలో బస్సును ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు రాదారపు పుష్పలత, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, విలేజ్ బస్సు అధికారి రాంరెడ్డి నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఒగ్గు బాల్‌రాజ్ యాదవ్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

- ఆగస్టు 12న చలో హైదరాబాద్‌కు రండి
- టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న విజయ్‌కుమార్, ఉద్యోగులు

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు చెందల విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నీలం సురేందర్ కోరారు. ఆగస్టు 12న పాత పెన్షన్ సంకల్ప రథయాత్ర పేరిట చేపడుతున్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించి, మాట్లాడారు. రాష్ట్రంలోని 1.80 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం కలిగిస్తున్న సీపీఎస్‌ను రద్దు చేయాలంటూ సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న రథయాత్ర 33 జిల్లాల గుండా వెళ్తూ.. ఈ నెల 26న రాజన్నసిరిసిల్లకు చేరుతుందని చెప్పారు. అదే రోజున కలెక్టరేట్, అంబేడ్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. వచ్చే నెల 12న చలో హైదరాబాద్‌కు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. వివిధ శాఖల ఉద్యోగులున్నారు.

కవి గూడూరి రాఘవేందర్ కన్నుమూత



రాఘవేందర్ రచన సహన పరీక్ష కథా సంకలనం


రాఘవేందర్ (ఫైల్)

సిరిసిల్లకల్చరల్: జిల్లాకు చెందిన వైద్యుడు, కవి గూడూరి రాఘవేందర్ బుధవారం రాత్రి కన్నుమూశారు. స్వాతంత్ర్యానంతర తొలితరం కథారచయిత గూడూరి సీతారాం సోదరుడు. వేములవాడ మండలం హనుమాజీపేటలో సినారె పొరుగింట్లో 15 మార్చి 1943న జన్మించారు. బాల్యం నుంచే కవిత్వంపై అనురక్తి పెంచుకున్నారు. కళాశాల మేగజైన్ తరంగిణి, వేములవాడ కేంద్రంగా విడుదలైన ఆనాటి విద్యుల్లత పత్రికల్లో తొలి రచనలు అచ్చయ్యాయి. నాటి హైదరాబాద్ రాష్ట్రంలో పాఠశాల దశలోనే 1957–60 మధ్యకాలంలో పలు కథానికలు రాశారు. అనంతరం బాలసాహిత్యం వైపు అడుగులు వేశారు. వృత్తిరీత్యా దంత వైద్యుడిగా జగిత్యాలలో స్థిరపడిన రాఘవేందర్ చిన్నపిల్లల మానసిక స్థితులను అధ్యయనం చేసి కథలుగా మలిచారు. డిటెక్టివ్ సాహిత్యం వ్యర్థం, రచయితలు రాయడం మానేయాలి, ఇంటాయన, ఇంటావిడ, చీకటిబాట, మొండి ఘటాలు, దూరపుకొండలు, మేడిపండ్లు, గౌరవం, ఆత్మ అభిమాని తదితర కథలు వెలువరించారు. రాఘవేందర్ అనారోగ్యంతో మరణించడంతో జిల్లా రచయితల సంఘం, మానేరు రచయితల సంఘం ప్రతినిధులు డాక్టర్ పత్తిపాక మోహన్, ఎలగొండ రవి, జనపాల శంకరయ్య, ఆడెపు లక్ష్మణ్, జూకంటి జగన్నాథం సంతాపం ప్రకటించారు.

అరుణాచలం యాత్రకు ఆర్టీసీ ఆఫర్

సిరిసిల్లటౌన్: తమిళనాడులోని అరుణాచలం క్షేత్రంలో ఈ నెల 31న పౌర్ణమిని పురస్కరించుకొని, గిరి ప్రదక్షిణ కోసం ఆర్టీసీ ఆఫర్ ప్రకటించింది. వేములవాడ రాజన్న ఆలయం నుంచి అరుణాచలం యాత్రకు సూపర్ లగ్జరీ బస్ నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 75555 నంబర్ గల బస్సు ఈ నెల 30 రాత్రి 8 గంటలకు బయలుదేరి కరీంనగర్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం, వెల్లూరు క్షేత్రాలను సందర్శిస్తూ.. 31న రాత్రి 8 గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణం ఆగస్టు 1న మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమై, 2న సాయంత్రం జోగులాంబ క్షేత్రం చేరుకుంటుందని, అదేరోజు సాయంత్రం బయలుదేరి రాత్రి 7 గంటల వరకు వేములవాడకు వస్తుందని పేర్కొన్నారు. ఇందుకోసం పెద్దలకు ఒక్కొక్కరికి రూ.4,200, పిల్లలకు రూ.3,400 టిక్కెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. అధికారిక వెబ్‌సైట్ tsrtconline.in లో ముందస్తుగా టికెట్ బుక్ చేసుకోవచ్చన్నారు. వివరాల కోసం 99592 5926, 73828 51826 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అవకాశం వస్తే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తా

- ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వికాస్


మాట్లాడుతున్న వికాస్‌రావు

వేములవాడఅర్బన్: అవకాశం వస్తే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వికాస్‌రావు పేర్కొన్నారు. వేములవాడ అర్బన్ మండలం గుర్రంవానిపల్లిలో గురువారం నిర్వహించిన ఆరోగ్యం, నైపుణ్యం అనే కార్యక్రమంలో మాట్లాడారు. మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు ఈ ప్రాంతానికి ఏళ్లుగా సేవ చేశారని, ప్రతిమ ఫౌండేషన్ ద్వారా ప్రతి గ్రామంలో అభివృద్ధి పనుల్లో పాలుపంచుకుంటున్నామని పేర్కొన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు, యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. లక్ష్మారెడ్డి, నర్సింహారెడ్డి, బుర్ర శేఖర్, గొల్లపల్లి వెంకటేశం పాల్గొన్నారు.

అప్పుల బాధతో నేతన్న ఆత్మహత్య


రోదిస్తున్న మృతుడి కుటుంబసభ్యులు


సురేష్ (ఫైల్)

తంగళ్లపల్లి: అప్పుల బాధతో ఓ నేతకార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన తంగళ్లపల్లి మండలంలోని పద్మనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంబటి సురేష్(36)కు భార్య కీర్తన, మూడో తరగతి, యూకేజీ చదివే ఇద్దరు కుమారులు ఉన్నారు. అతను పవర్‌లూమ్ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల తన తండ్రి నుంచి తనకు వాటాగా వచ్చిన భూమిలో అప్పు చేసి, ఇంటిని నిర్మించాడు. అప్పు ఎలా తీర్చాలంటూ తరచూ భార్యకు చెప్పుకొని, బాధపడేవాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన మృతుడి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఘనంగా తీజ్ వేడుకలు



రుద్రంగి(వేములవాడ): గిరిజనుల సంప్రదాయ తీజ్ వేడుకలు గురువారం రుద్రంగిలోని దసరానాయక్ తండాలో ఘనంగా జరిగాయి. గిరిజన యువతులు గోధుమలను బుట్టలలో ఉంచి తొమ్మిది రోజులపాటు పూజలు చేస్తూ నీరు పోయగా నారు మొలకెత్తింది. ఆ గోధుమనారును దేవతలా కొలుస్తూ తొమ్మిదో రోజు నూతన వస్త్రాలు ధరించి ఆటపాటలతో సరదాగా గడిపారు. సంప్రదాయ నృత్యాలు చేస్తూ సమీపంలోని చెరువులో గోధుమనారును నిమజ్జనం చేశారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. సామ మోహన్‌రెడ్డి, చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షంలో తడిసి నెమలికి అస్వస్థత


నెమలిని ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాసరావుకు అప్పగిస్తున్న యువకులు

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని విద్యానగర్ మానేరు వాగు తీరంలో గురువారం జాతీయ పక్షి నెమలి సంచరించింది. వర్షంలో తడిసి, చలికి వణుకుతూ అస్వస్థతకు గురైంది. స్థానిక యువకులు జుబేర్, జీషన్, ముబీన్‌లు నెమలిని పట్టుకొని, అటవీశాఖ ఆఫీస్‌కు తీసుకెళ్లారు. సిరిసిల్ల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరావుకు అప్పగించారు. ఆ నెమలికి వైద్యం చేయించి, అడవిలో వదిలేస్తామని ఆయన పేర్కొన్నారు.